క్లుప్తంగా

పంటల పరిశీలన



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): తాండూర్ శివారులో సాగవుతున్న వరిపంటలను బుధవారం ఏవో సాయికిరణ్, కృషివిజ్ఞానకేంద్రం శాస్త్రవేత్త అనిల్‌రెడ్డి రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కోతదశకు చేరుతున్న పంటలను దోమపోటు నుంచి కాపాడుకునేందుకు రైతులకు వారు పలు సూచనలు చేశారు. వరిపంటలో దోమపోటును గమనించినట్లయితే ఎకరం పంటపై లీటర్ నీటిలో 0.6గ్రాముల పైమెట్రోజిన్ డబ్ల్యూజీ అనే మందును కలిపి మొక్క మొదట్లో పడేలా పిచికారి చేయాలని రైతులకు వారు చెప్పారు. పిచికారి చేసేటప్పుడు పొలంలో నీరు తక్కువగా ఉండేలా చూసుకోవాలన్నారు. రైతులు నాగేశ్వర్‌రెడ్డి, రమేష్, లింగం ఉన్నారు.

టెన్త్ టాపర్లకు నగదు బహుమతి అందజేత



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని ఆత్మకూర్ హైస్కూల్‌లో 2023–24, 2024–25 విద్యా సంవత్సరాలలో పదో తరగతి చదివి స్కూల్ టాపర్లుగా నిలిచిన పలువురు విద్యార్థులకు బుధవారం గ్రామానికి చెందిన కుంట రాఘవరెడ్డి తన తల్లిదండ్రులు కుంట సంగారెడ్డి– సాయవ్వల జ్ఞాపకార్థం నగదు బహుమతిని అందజేశారు. రెండేళ్లల్లో మొదటి స్థానంలో నిలిచిన రజిత, స్రవంతికి రూ.10వేల చొప్పున, రెండోస్థానంలో నిలిచిన రాంచరణ్, భూమయ్యకు రూ.5 వేల చొప్పున రాఘవరెడ్డి అందజేశారు. వీరితోపాటు ప్రోత్సాహక బహుమతిగా రాకేశ్, గౌతమిరెడ్డి, అనన్య, సహస్రలకు రూ.2 వేల చొప్పున నగదును ఆయన అందజేశారు. కాగా గ్రామ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం డెస్క్ బెంచీల ఏర్పాటు కోసం రూ.40 వేలు హెచ్‌ఎంకు అందజేశారు. మాజీ జెడ్పీటీసీ సభ్యుడు మనోహర్‌రెడ్డి, పాఠశాల హెచ్‌ఎం మాజీ సర్పంచ్ బాల్‌రెడ్డి, పాఠశాల హెచ్‌ఎం జబీన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పార్ట్ టైం ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించాలి



రామారెడ్డి: సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల/కళాశాల ఉప్పల్‌వాయిలో పనిచేస్తున్న పార్ట్ టైం ఉపాధ్యాయులకు మూడు నెలలుగా జీతాలు రావడం లేదు. దీనిపై పార్ట్ టైం ఉపాధ్యాయులు స్పందిస్తూ.. జీతాలు తొందరగా విడుదల చేయాలని పాఠశాల/కళాశాల ప్రిన్సిపాల్ శివరాంకు బుధవారం వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం ఉప్పల్‌వాయి పార్ట్ టైం ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు మేఘజి రావు మాట్లాడుతూ.. వెంటనే జీతాలు విడుదల చేయాలన్నారు. ఉపాధ్యాయులు డబ్బులు లేక ఇబ్బంది పడుతున్నారని దసరా పండుగను కూడా ఇబ్బందులతోనే జరుపుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

డీసీసీ అధ్యక్ష పదవికి దరఖాస్తులు



కామారెడ్డి అర్బన్: జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్ష పదవికి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ పంపరి శ్రీనివాస్, శాబ్దిపూర్ మాజీ ఎంపీటీసీ నిమ్మ విజయ్‌కుమార్ రెడ్డి, పోసానిపేట మాజీ సర్పంచ్ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు గీరెడ్డి మహేందర్‌రెడ్డిలు దరఖాస్తు చేసుకున్నారు. పార్టీ కేంద్ర, రాష్ట్ర పరిశీలకులు రాజ్‌పాల్, అశోక్‌రెడ్డిలకు తమ దరఖాస్తులను స్వయంగా అందజేశారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిక



లింగంపేట(ఎల్లారెడ్డి): ముంబోజిపేట గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు బుధవారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. గ్రామానికి చెందిన గుర్రపు చంద్రయ్య, విజయ్‌తో పాటు పలువురు నాయకులకు ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. మండల పార్టీ అధ్యక్షుడు నారాగౌడ్, దశరథ్ నాయక్, రామకృష్ణగౌడ్, రాంరెడ్డి, నగేష్, రాజేశ్వర్‌గౌడ్, జనార్దన్‌గౌడ్, రవీందర్‌చారి తదితరులు పాల్గొన్నారు.

కొలతలకే పరిమితమా..?

- ఇసుక మేటలు తొలగించరా...!
- నెల రోజులు గడుస్తున్నా పనుల్లో పురోగతి శూన్యం
- ఆందోళనలో అన్నదాతలు
- యాసంగి సాగుకైనా అనుకూలంగా మారేనా..?



బూరుగిద్ద శివారులో నిలిచిన ఇసుక మేట తొలగింపు పనులు



లింగంపేట శివారులోని పాముల వాగు పరీవాహక ప్రాంతంలో కొలతలు తీస్తున్న అధికారులు

లింగంపేట(ఎల్లారెడ్డి): ఆగస్టు చివరి వారంలో కురిసిన భారీ వర్షాల కారణంగా లింగంపేట మండలంలోని పలు గ్రామాల్లో కుంటలు, చెరువులు తెగిపోయి పంట పొలాల్లో ఇసుక మేటలు ఏర్పడ్డాయి. అలాగే పెద్దవాగు, పాముల వాగుకు భారీ వరద నీరు పోటెత్తడంతో పరివాహక ప్రాంతాల్లోని పంట పొలాల్లో సైతం ఇసుక మేటలు వేశాయి. ఈ క్రమంలో మండలంలోని ఆయా గ్రామాల్లో రైతులకు భారీ నష్టం ఏర్పడింది. వరి, పత్తి, మొక్కజొన్న, సోయా పంటలు వరద నీటిలో కొట్టుకుపోయాయి. దాంతో అన్నదాతలు ఆగమయ్యారు. పంటల సాగుకు పెట్టిన పెట్టుబడి ఖర్చులు వచ్చే పరిస్థితి లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని పలు చెరువులతో పాటు పాముల వాగు వంతెన, ఆయా గ్రామాలకు వెళ్లే రోడ్లు వరద నీటికి కొట్టుకుపోయాయి. దాంతో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే.. సీఎం రేవంత్‌రెడ్డికి మండలంలో జరిగిన నష్టాన్ని ఆయన దృష్టికి తెచ్చారు. వెంటనే స్పందించిన సీఎం లింగంపేట మండలానికి వచ్చి పాముల వాగు వంతెన, రోడ్లు, బూరుగిద్ద వద్ద ఏర్పడిన ఇసుక మేటలను సెప్టెంబర్ 4న పరిశీలించారు. ఆయన లింగంపల్లి పాముల వాగు వంతెనతో పాటు రోడ్లు నూతనంగా నిర్మించడానికి నిధులు మంజూరు చేస్తామని వెల్లడించారు. అలాగే పంట పొలాల్లో ఏర్పడిన ఇసుక మేటలను తొలగించి తిరిగి సాగుకు యోగ్యమయ్యేలా చేయాలని అధికారులను ఆదేశించారు. దాంతో అధికారులు ఉపాధి హామీ పథకంలో ఇసుక మేటలు తొలగించడానికి కొలతలు తీసుకున్నారు. బూరుగిద్దలో పనులు సైతం ప్రారంభించారు. ప్రారంభించిన పనుల్లో పురోగతి లేక 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే' అన్నట్లుగా ఉంది. పనుల్లో పురోగతి లేకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్ పంటలు కోత దశకు వచ్చాయి. ముందుగా వేసిన పంటల కోతలు ప్రారంభమయ్యాయి. ఈ నెలాఖరు వరకు వరి పంటల కోతలు పూర్తయ్యే అవకాశాలున్నాయి. నవంబర్, డిసెంబర్‌లో తిరిగి యాసంగి పంటల సాగుకు రైతులు సన్నద్ధమవుతారు. అధికారులు ఇసుక మేటల తొలగింపు వేగవంతం చేయకపోతే రైతులకు ఇబ్బందిగా మారే అవకాశాలు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఇసుక మేటలు తొలగించి సాగుకు యోగ్యంగా చేయాలని రైతులు కోరుతున్నారు.

288 ఎకరాల్లో ఇసుక మేటలు

మండలంలోని పలు గ్రామాల్లో 288 ఎకరాల్లో ఇసుక మేటలు ఏర్పడినట్లు అధికారుల సర్వేలో తేలింది. లింగంపేటలో 125 మంది రైతులు, కన్నాపూర్ 111, లింగంపల్లి(ఖుర్దు) 117, కొర్పోల్ 58, పొల్కంపేట 33, శెట్పల్లి 36, పోతాయిపల్లి 33, మోతె 15, మెంగారం 15, బాయంపల్లి 11, నల్లమడుగు 10, పర్మళ్ల 7 ఎకరాలతో పాటు ఆయా గ్రామాల్లోని 602 మంది రైతులకు గాను 288 ఎకరాల్లో ఇసుక మేటలు ఏర్పడినట్లు ఉపాధి హామీ అధికారులు వెల్లడించారు. అలాగే వరదల కారణంగా మండలంలోని ఆయా గ్రామాల్లో 1,336 మంది రైతులకు గాను 1,036 ఎకరాల్లో పంటలు నష్టం జరిగినట్లు మండల వ్యవసాయాధికారి అనిల్ కుమార్ తెలిపారు. ఇప్పటి వరకు రైతులకు నష్టపరిహారం అందలేదు. ఇసుక మేటలు తొలగించలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇసుక మేటలు తొలగించాలి



ఊర కుంట తెగిపోయి రెండు ఎకరాల్లో ఇసుక మేటలు ఏర్పడ్డాయి. అధికారులు ఇసుక మేటలు పరిశీలించి సర్వే చేసి కొలతలు నిర్వహించారు. రెండు, మూడు రోజులు పనులు చేశారు. పదిహేను రోజులుగా పనులు నిలిపివేశారు. అధికారులు స్పందించి తొందరగా ఇసుక మేటలు తొలగించాలి.

– లక్ష్మి, రైతు, బూరుగిద్ద

నష్టపరిహారం చెల్లించాలి



ఆగస్టు నెలలో కురిసిన భారీ వర్షానికి వరద నీటిలో వరి పంట మునిగిపోయింది. మూడు ఎకరాలు చేతికి రాకుండా పోయింది. సెప్టెంబర్ 4న సీఎం మునిగిన పంటలు, ఇసుక మేటలను పరిశీలించారు. అధికారులు సర్వే చేసి రాసుకుపోయారు. నేటికీ నష్టపరిహారం అందలేదు. అధికారులు స్పందించి నష్టపరిహారం త్వరగా అందించాలి.

– ఆంటోని, రైతు, బూరుగిద్ద

బీసీల బంద్‌ను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న కుమ్మరి యాదగిరి

పిట్లం(జుక్కల్): బీసీలకు 42 శాతం రిజర్వేషన్ మా హక్కు మా గౌరవమని, ఈ నెల 18న తెలంగాణ రాష్ట్ర బీసీ బంద్‌ను విజయవంతం చేయాలని బీసీ రాజ్యాధికార సమితి జిల్లా ఇన్‌చార్జి కుమ్మరి యాదగిరి కోరారు. మండల కేంద్రంలోని సాయి గార్డెన్‌లో బుధవారం బీసీ సంఘాల ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఇప్పటి వరకు బీసీ వర్గాలకు సముచిత న్యాయం జరగలేదని, విద్య, ఉద్యోగాలు, రాజకీయ అవకాశాలలో అన్యాయం జరుగుతున్నదన్నారు. విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, సంఘాలు బంద్‌కు మద్దతు ప్రకటించాలని కోరారు. నేతలు నీలకంటి లోక సంతోష్, ఆకుల లక్ష్మణ్, దామెరంచ బాబా గౌడ్, నర్సగౌడ్, ధర్మవీర్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్లకు మరమ్మతులు



సాక్షి ఎఫెక్ట్..

మద్నూర్(జుక్కల్): రహదారులు అస్తవ్యస్తంగా తయారయ్యాయని రోడ్ల వెంట ముళ్లపొదలు పెరిగిపోయి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని సాక్షి దినపత్రికలో ఈ నెల 14న వచ్చిన 'రోడ్లకు మరమ్మతులు చేయరూ..!' అనే వార్తకు అధికారులు స్పందించారు. మద్నూర్, డోంగ్లీ మండలంలోని రోడ్లకు బుధవారం ఆర్‌అండ్‌బీ అధికారులు ప్యాచ్ వర్క్ చేశారు. రోడ్లపై ఉన్న గుంతలను పూడ్చివేయించారు. రోడ్లపైకి వచ్చిన ముళ్లపొదలను తొలగించడంతో వాహనదారులు హర్షం వ్యక్తం చేశారు.

బీజేపీ దళిత మోర్చా పట్టణ కార్యవర్గం ఎన్నిక



కామారెడ్డి టౌన్: బీజేపీ దళిత మోర్చా పట్టణ కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సంగీ రాజేందర్, ఉపాధ్యక్షులుగా రాజు, నవీన్, కిషన్, కల్లూరి రూపేష్, ప్రధాన కార్యదర్శులుగా నవీన్, పెరుమాండ్ల గంగోలి, కార్యదర్శులుగా రవీందర్, సత్యనారాయణ, అశోక్, నాగరాజు నరేందర్, కార్యవర్గ సభ్యులుగా సుతారి స్వామి, గణేష్, శేఖర్, భరత్, శివకుమార్, రవి, శివ, శివరాజు, శంకర్, రాకేష్, సన్నీ, బాలనర్సు, శ్రీకాంత్, రేణుక, గీత, ప్రియాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గ సభ్యులను బీజేపీ పట్టణ అధ్యక్షుడు శ్రీకాంత్ సన్మానించారు.

సంక్షిప్తం

పొల్కంపేటలో పశువైద్య శిబిరం

లింగంపేట(ఎల్లారెడ్డి): పొల్కంపేటలో బుధవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 362 గేదెలు, 126 ఆవులు, 22 దూడలకు గాలికుంటు నివారణ టీకాలు, నట్టల నివారణ మందులు వేసినట్లు తెలిపారు. జిల్లా జాయింట్ డైరెక్టర్ డాక్టర్ భాస్కరన్, ఏడీ డాక్టర్ శ్రీనివాస్, మండల పశువైద్యాధికారి హనాజోనస్, తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ మందిరంలో కడప ప్రతిష్ఠాపన



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): బంజరతండాలో నూతనంగా చేపట్టిన సేవాలాల్, జగదాంబమాత ఆలయంలో బుధవారం భక్తిశ్రద్ధలతో కడప ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తండావాసులు నిర్మాణ దశలో ఉన్న భోగ్‌బండార్‌ను నైవేద్యంగా సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలిండియా బంజార సేవా సంఘం మండలాధ్యక్షుడు రమేశ్, తండావాసులు పాల్గొన్నారు.

కస్తుర్బా పాఠశాలలో వైద్య శిబిరం

బాన్సువాడ: బీర్కూర్ మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో బుధవారం సెవెన్‌హిల్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. పలు రోగాలకు చికిత్సలు చేశారు. లయన్స్‌క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో దిల్‌సే కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన శిబిరంలో లయన్స్ వెంకటేశ్వరరావు, రమేష్, గాలయ్య తదితరులు పాల్గొన్నారు.

వదినామరదళ్ల గాజుల సంబురం



కామారెడ్డి రూరల్: దేవునిపల్లిలో వదినా మరదళ్ల ఆధ్వర్యంలో మెహందీ, గాజుల సంబురాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. గ్రామ శివారులోని ఓ గెస్ట్ హౌజ్‌లో మహిళలు మెహందీ, గాజులను పెట్టుకుని సంబురాలు జరుపుకున్నారు. సాంప్రదాయబద్ధంగా తయారై వివిధ రకాల పాటలకు డాన్సులు చేశారు. ఖోఖో, కబడ్డీ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు.

హుండీల ఆదాయం లెక్కింపు

మాచారెడ్డి: చుక్కాపూర్ శ్రీలక్ష్మీనర్సింహ స్వామి ఆలయంలో బుధవారం హుండీలను లెక్కించారు. 70 రోజుల తర్వాత లెక్కించిన తొమ్మిది హుండీల ద్వారా రూ.3.36 లక్షల ఆదాయం వచ్చినట్లు ఈవో ప్రభురాంచంద్రం తెలిపారు. దేవాదాయశాఖ ఏసీ విజయరామరావు, ఆలయ కమిటీ చైర్మన్ కమలాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

బీబీపేట: మండలంలోని తుజాల్‌పూర్ గ్రామానికి చెందిన వాసవి క్లబ్ సభ్యుడు పప్పుల శంకర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో బుధవారం వాసవి క్లబ్ నుంచి రూ.10 వేలు, అంతర్జాతీయ వాసవి క్లబ్ నుంచి అధ్యక్షుడు ఇరుకుల రామకృష్ణ ఆదేశానుసారం జిల్లా గవర్నర్ గట్టు రాణి వాసవి క్లబ్ సభ్యుల సమక్షంలో రూ.25 వేలను బాధిత కుటుంబ సభ్యులకు 'మహా ప్రస్థానం' కార్యక్రమం కింద అందజేశారు.

అంత్యక్రియలకు..

భిక్కనూరు: రామేశ్వర్‌పల్లి గ్రామానికి చెందిన కొండగారి మాధవి అనే నిరుపేద మహిళ కిడ్నీలు చెడిపోయి బుధవారం మృతి చెందింది. ఆమె కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవడంతో బీఆర్‌ఎస్ పార్టీ తరపున రూ.5 వేలను అంత్యక్రియల కోసం అందజేశారు. రామేశ్వర్‌పల్లి విండో చైర్మన్ నాగార్తి భూంరెడ్డి, మాజీ సర్పంచ్ పోతిరెడ్డి పాల్గొన్నారు.

మున్నూరుకాపు విద్యార్థులకు..

కామారెడ్డి అర్బన్: హైదరాబాద్ కాచిగూడ మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహం ద్వారా తండ్రి లేదా సంరక్షకులు లేని విద్యార్థులకు 2025–26 విద్యాసంవత్సరానికి ఆర్థిక సహాయం అందజేయడానికి వచ్చే నెల 14వ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు కార్యనిర్వహణ అధికారి అంజనారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఒకటవ తరగతి నుంచి పీజీ వరకు చదివే మున్నూరుకాపు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని, వివరాలకు కాచిగూడలోని వసతి గృహం కార్యాలయంలో స్వయంగా ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు లేదా 040–24658160, 040–24657404, 9491627404 నంబర్లకు సంప్రదించవచ్చన్నారు.

సైనిక్ స్కూల్‌కి విద్యార్థి ఎంపిక



రాజంపేట: శివాయిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన ఐదవ తరగతి చదువుతున్న అభిజిత్ రెడ్డి సైనిక్ స్కూల్‌కి ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం విక్రాంత్ తెలిపారు. ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందనలు తెలియజేశారని తెలిపారు.


సిద్ధరామేశ్వరాలయం పునరుద్ధరణ కమిటీ నియామకం

భిక్కనూరు: దక్షిణకాశీగా పేరొందిన భిక్కనూరు సిద్ధరామేశ్వరాలయం పునరుద్ధరణ కమిటీని 14 మంది సభ్యులతో ప్రభుత్వం నియమించింది. ఈమేరకు ప్రభుత్వ ప్రిన్సిపల్ కార్యదర్శి శైలజ రామయ్యార్ బుధవారం నియామక ఉత్తర్వులను జారీచేశారు. సింగారపు నర్సమ్మ, నీల అంజయ్య, ఎన్గు అమృత, సామ సంతోషరెడ్డి, పెంజర్ల ఈశ్వర్‌రెడ్డి, ముత్తనోల్ల కిష్టయ్య, నాగార్తి రమేష్‌రెడ్డి, గుడిసె నారాయణ, లింగి బాగయ్య, మొకాళ్ల బాపురెడ్డి, చీకోటి ప్రభాకర్, అక్కు కార్తిక్, తాటిపాముల లింబాద్రి, అందే దయాకర్‌రెడ్డిలను నియమించినట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వీరి పదవి కాలం రెండేళ్లు.

ఉపాధి కూలీలకు ఈ-కేవైసీ తప్పనిసరి



తాడ్వాయి(ఎల్లారెడ్డి): ఉపాధి హామీ పథకం కింద పనిచేసే కూలీలు తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలని ఏపీవో కృష్ణగౌడ్ సూచించారు. సోమారం గ్రామంలో బుధవారం ఈ-కేవైసీ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలో 18 గ్రామాలకు గాను 11 మంది ఫీల్డు అసిస్టెంటులు ఉన్నారని, మిగత ఏడు గ్రామాలలో సీనియర్ మేట్ల ద్వారా ఈ-కేవైసీ చేయిస్తున్నామన్నారు.



బీబీపేట: ఉపాధి హామీ కూలీలకు ఐరిస్ ద్వారా ఈ-కేవైసీ నిర్వహిస్తున్నట్లు ఫీల్డ్ అసిస్టెంట్ ప్రశాంత్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని పలువురి ఫోటోలను తీసి అప్‌లోడ్ చేశారు. ఉపాధి హామీ పనుల్లో బోగస్ హాజరుకు చెక్ పెట్టేందుకు ఇది ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు.

న్యాయవ్యవస్థపై అవగాహన కలిగి ఉండాలి

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ జడ్జి నాగరాణి
- మద్నూర్, పెద్ద ఎక్లారలో న్యాయ చైతన్య సదస్సులు



పెద్ద ఎక్లార గురుకుల పాఠశాలలో జడ్జిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

మద్నూర్(జుక్కల్): చిన్న వయస్సులోనే న్యాయ వ్యవస్థపై అవగహన కలిగి ఉంటే భవిష్యత్తులో మంచి పౌరులుగా ఎదగగలుగుతారని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ జడ్జి నాగరాణి పేర్కొన్నారు. మండలంలోని పెద్ద ఎక్లార గేటు వద్ద గల సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాల, మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల పాఠశాలలో బుధవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ చైతన్య అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జికి విద్యార్థినులు, ఉపాధ్యాయులు స్వాగతం పలికారు. అనంతరం విద్యార్థులకు న్యాయ వ్యవస్థపై అవగాహన కల్పించి వారి హక్కుల గురించి జడ్జి నాగరాణి తెలియజేశారు. బిచ్కుంద కోర్టు సివిల్ జడ్జి వినీల్‌కుమార్, న్యాయసేవా సంస్థ వలంటీర్లు సురేష్, అశోక్, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ స్వప్న, న్యాయవాదులు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ నీటినే వాడాలి

- ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజ్‌కుమార్



మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజ్‌కుమార్

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మిషన్ భగీరథ నీటిలో చక్కని మినరల్స్ ఉంటాయని, వాటిని తాగడం వల్ల ఆరోగ్యానికి చాలా మంచిదని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజ్‌కుమార్ సూచించారు. తాండూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం మిషన్ భగీరథ నీటి వినియోగంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్వో వాటర్‌లో మినరల్స్ తొలగిపోతాయన్నారు. గతంలో ఎప్పుడో మిషన్ భగీరథ నీరు కలుషితంగా సరఫరా అయిందని ప్రస్తుతం ఆ నీరు తాగబోమని చెప్పడం సరికాదన్నారు. నీటి సరఫరాలో ఏమైనా ఇబ్బందులు వస్తే తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. జీపీ కార్యదర్శి తిరుపతి, ల్యాబ్ అసిస్టెంట్లు నాగేశ్వర్‌రావు, అశోక్, ఫీల్డ్‌అసిస్టెంట్ గోపి, మిషన్ భగీరథ సూపర్‌వైజర్స్ సిద్ధిరాములు, పరంధాములు, సిబ్బంది వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

మున్నూరుకాపు సంఘ శాశ్వత సభ్యత్వ కార్డుల పంపిణీ



కామారెడ్డి అర్బన్: తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు సంఘ శాశ్వత సభ్యత్వ రుసుం రూ.100 చెల్లించిన పలు గ్రామాల వారికి గుర్తింపు కార్డులను అందజేసినట్లు సంఘం అపెక్స్ కమిటీ రాష్ట్ర సభ్యుడు మామిండ్ల అంజయ్య, రాష్ట్ర కార్యదర్శి నీలం నర్సింలు తెలిపారు. బుధవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో నాయకులు పి.అంజయ్య, జి.భాస్కర్, ఎం.భీమేష్, ఎం.లింగం, ఎస్.రాజలింగం, రాజేష్, ముల్కరాజు తదితరులు పాల్గొన్నారు.

బల్దియా పీఠం దక్కించుకోవాలి



కామారెడ్డి టౌన్: మున్సిపల్ చైర్‌పర్సన్ పీఠం దక్కించుకునేందుకు నాయకులు కృషి చేయాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు శ్రీకాంత్ తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పట్టణ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల కోసం సన్నద్ధం కావాలన్నారు. అన్ని వార్డులో బీజేపీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్‌రెడ్డి, అసెంబ్లీ ఇన్‌చార్జి లక్ష్మారెడ్డి తదితరులున్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించాలి



ఎస్‌బీఐ సర్వీస్ పాయింట్‌ను ప్రారంభిస్తున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి

బాన్సువాడ రూరల్: సమయపాలన పాటిస్తూ, ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించాలని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజుతో కలిసి బోర్లం క్యాంపులో ఎస్‌బీఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కస్టమర్ సర్వీస్ పాయింట్‌ను ప్రారంభించి మాట్లాడారు. దోపిడీ, దొంగతనాలు, సైబర్ నేరాలు పెరిగిపోతున్న నేపథ్యంలో ప్రజలు మరింత జాగ్రత్తలు పాటించాలన్నారు. గ్రామంలో పలువురికి ఇంటినిర్మాణ బిల్లులు నిలిచిపోయాయని తెల్సుకుని ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సర్వీస్‌పాయింట్ నిర్వాహకులు రాధిక ఆనంద్, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, రాజేశ్వర్‌గౌడ్, బన్సీనాయక్, జెమ్లా నాయక్, మమ్మాయి కాశీరాం, సంగం శ్రీనివాస్‌రెడ్డి, కొండ శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారంతో పాఠశాల అభివృద్ధి



బాన్సువాడ రూరల్: ప్రభుత్వ సహకారంతో పాటు దాతలు, సమాజం సహకారం ఉన్నప్పుడే పాఠశాలలు అభివృద్ధి చెందుతాయని దేశాయిపేట్ జెడ్పీహైస్కూల్ హెచ్‌ఎం నివేదిత అన్నారు. బుధవారం పాఠశాలలో పాఠశాల అభివృద్ధి కోసం విరాళాలు అందించిన పలువురు దాతలను ఆమె సన్మానించి మాట్లాడారు. పాఠశాల పూర్వ విద్యార్థి ప్రస్తుత మహ్మద్‌నగర్ ఎంఈవో దమ్ము వెంకటేశ్వర్లు రూ.6 వేల విలువ చేసే పోడియం అందించారన్నారు. అలాగే ఆజంగంజ్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా ఉన్న నవాతు శ్రీనివాస్, ఎస్సై నక్క భాస్కర్, నక్కం రాజులు రూ.16వేల విలువ చేసే 20బెంచీలు బహూకరించారన్నారు. రూ.11వేల విలువ చేసే సౌండ్ సిస్టంను పూర్వ విద్యార్థులు లాగే గంగాప్రసాద్, భానుక సంజీవ్‌లు అందజేశారన్నారు. వీరందరికి కృతజ్ఞతలు తెలిపారు.

రైతు శిక్షణ తరగతులు, వైద్య శిబిరాలను నిర్వహిస్తాం



భిక్కనూరు: మండలంలో రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రైతు శిక్షణ తరగతులు, ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తామని రెడ్డి సంక్షేమ సంఘం నూతన అధ్యక్షుడు కుంట లింగారెడ్డి అన్నారు. బుధవారం ఆయన భిక్కనూరు మండల కేంద్రంలో పదవీ బాధ్యతలను స్వీకరించి మాట్లాడారు. రెడ్డి కులస్తుల్లో 98 శాతం మంది వ్యవసాయం చేస్తున్నారని, వారికి మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక వ్యవసాయం సాగుకు రైతు శిక్షణ తరగతులను నిర్వహిస్తామన్నారు. అలాగే ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తామన్నారు. రెడ్లలో చాలా మంది ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నారని, వారికి సహాయం అందిస్తానన్నారు. సంఘం ఉపాధ్యక్షుడు సతీష్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్‌రెడ్డి కార్యదర్శి బాపురెడ్డి, నేతలు నరేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.